వెలుగు కార్యాలయంలో దొంగలు!

- మాయమవుతున్న కుట్టుమిషన్లు
- ఇంటి దొంగలపై అనుమానం
- పట్టించుకోని ఏపీఎం


గుంతకల్లులోని వెలుగు కార్యాలయం


కార్యాలయంలో ఉంచిన కుట్టు మిషన్లు

గుంతకల్లు రూరల్: మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధిని కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టు మిషన్లు వెలుగు కార్యాలయంలో గత కొన్ని నెలలుగా ఒకటి తరువాత ఒకటి మాయం అవుతున్నాయి. షయం తెలిసినా ఏపీఎం గానీ, ఇతర సిబ్బంది మిన్నకుండిపోయారు. విషయం ఆ నోట ఈ నోట పడి నెమ్మదిగా బయటకు పొక్కడంతో దిక్కుతోచని కార్యాలయ సిబ్బంది కుట్టు మిషన్లు ఎలా మాయం అయ్యాయో, ఎవరు తీసుకెళ్లారో కూడా తమకు తెలియదనడం విడ్డూరంగా ఉంది. వివరాలు.. మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధిని కల్పించే క్రమంలో భాగంగా అప్పటి ప్రభుత్వం 2015 డిసెంబర్‌లో మండలంలోని వెలుగు కార్యాలయానికి 20 కుట్టు మిషన్లను మంజూరు చేసింది. 2016 జనవరి నుంచి కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఒక్కో బ్యాచ్‌కు 30 మంది మహిళల చొప్పున 48 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇలా రెండేళ్ల పాటు సుమారు ఐదు బ్యాచ్‌లకు కుట్టు శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో కుట్టు మిషన్లను కార్యాలయంలో ఒక మూలన పెట్టేశారు. సాధారణంగా ప్రభుత్వం తరఫున కుట్టు శిక్షణ కార్యక్రమం ఎక్కడ జరిగినా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఒకచోట ఉన్న కుట్టు మిషన్లను మరోచోటకు తరలించాల్సి ఉంటుంది. కానీ అటువంటి కార్యక్రమం లేకపోవడంతో మూలన పెట్టిన కుట్టుమిషన్లు క్రమంగా దుమ్ముపట్టి తుప్పు పట్టే దశకు చేరుకుంటూ వచ్చాయి.

పొంతనలేని సమాధానాలు

మూలన ఉంచిన కుట్టు మిషన్లు గత కొన్ని నెలలుగా క్రమంగా ఒకటి తరువాత మరొకటి మాయం అవుతూ వచ్చాయి. విషయం తెలుసుకున్న ఏపీఎం గుణశ్యామ్, ఇతర సిబ్బంది ఎవరూ నోరు మెదపకుండా మిన్నకుండి పోయారు. ఈ క్రమంలో మూడు రోజులు క్రితం మరో కుట్టు మిషన్ మాయం అయింది. విషయం బయటకు పొక్కడంతో ఏమి చెప్పాలో తెలియని కార్యాలయ సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్తూ దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా తమ కార్యాలయాన్ని మూడు రోజుల పాటు ఇచ్చామని, ఆ సమయంలోనే కుట్టు మిషన్లు మాయం అయ్యాయని కార్యాలయ అకౌంటెంట్ రాజేశ్వరి చెబుతున్నారు. కార్యాలయానికి నిత్యం ఎంతోమంది వచ్చి వెళ్తుంటారు.. వారిలో ఎవరు కుట్టు మిషన్లు తీసుకెళ్లారో మాకెలా తెలుస్తుందని ఏపీఎం చెప్పడం గమనార్హం. మాయం అయిన వాటిలో మూడు కుట్టు మిషన్లు ఏకంగా స్టాండ్‌తో పాటు తీసుకెళ్లగా, మరో కుట్టు మిషన్ కేవలం పై భాగం మాత్రమే తీసుకెళ్లారు. కార్యాలయానికి పనిపై వచ్చి వెళ్లే వ్యక్తులు ఎవరూ చూడకుండా, కార్యాలయ సిబ్బందికి తెలియకుండా కుట్టు మిషన్లను తరలించడం సాధ్యమయ్యే పనేనా. కుట్టు మిషన్లు మాయం అవుతున్న విషయం తెలిసి కూడా ఇన్ని రోజులు మిన్నకుండి పోయిన కార్యాలయ సిబ్బంది విషయం బయటపడిన తరువాత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం చూస్తుంటే ఇది నిజంగా బయటవారు చేసిన పనా? లేక ఇంటి దొంగల పనా? అనే అనుమానం కలుగుతోంది.

మూడు రోజుల కిందట ఒక మిషన్ పోయింది...



కుట్టు మిషన్లు తరచూ మాయం అవుతుండటంతో మూడు రోజుల క్రితం 17 కుట్టు మిషన్లను లెక్కపెట్టి వెళ్లాను. తీరా ఈ రోజు వచ్చి చూస్తే వాటిలో మరో కుట్టు మిషన్ పై భాగం మాయమైంది. కుట్టు మిషన్లు ఎవరు తీసుకెళ్తున్నారో, ఎలా బయటకు వెళ్తున్నాయో తెలియడం లేదు.

– రాజేశ్వరి, అకౌంటెంట్

ఎవరు తీసుకెళ్తున్నారో మాకెలా తెలుస్తుంది..



నాలుగు కుట్టు మిషన్లు పోయిన మాట వాస్తవమే. కార్యాలయానికి నిత్యం వందలాది మంది డ్వాక్రా మహిళలు, వారిని కార్యాలయంలో వదలడానికి వచ్చే వారి భర్తలు, ఆటో డ్రైవర్లు, యానిమేటర్లు ఇలా ఎంతోమంది వచ్చి వెళ్తుంటారు. వీరిలో కుట్టు మిషన్లను ఎవరు తీసుకెళ్లారో మాకెలా తెలుస్తుంది.

– గుణశ్యామ్, వెలుగు ఏపీఎం

క్లుప్తంగా

సజావుగా వేలం


వేలం నిర్వహిస్తున్న ఈఓ అశ్వత్థనాయుడు

యాడికి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం యాడికి మేజరు పంచాయతీకి సంబంధించిన దినసరి మార్కెట్, బస్టాండు, జంతువధ శాల నిర్వహణకు ఈఓ అశ్వర్ధనాయుడు వేలం నిర్వహించారు. బస్టాండు వద్ద ప్రతిఫలం కోసం రాజశేఖర్ రూ.3.49 లక్షలు వేలం పాటను పాడి దక్కించుకున్నాడు. శివ కోటి అనే వ్యక్తి రూ.4 లక్షలకు దినసరి మార్కెట్‌ను, జంతువధశాలను రూ55.500కు నాగేంద్ర అనే వ్యక్తి దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయుడు, ఈఓపీఆర్డీ శశికళ, ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, పంచాయతీ సిబ్బంది లక్ష్మణ్, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

పామిడి: మండలంలోని అనుపంల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అభిషేకార్చన పూజా కార్యక్రమాలు చేశారు. మంగళహారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీ రాంజనేయులు, ఎంపీటీసీలు మజ్జిగ రాజశేఖర్, కాయల మహేష్, దాసరి లక్ష్మీనారాయణ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి సూచించారు. కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ఐసీడీఎస్, ఐసీపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని చేపడుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వాణి, ఐసీపీఎస్ అధికారిణి వెంకటేశ్వరిలు బాల్య వివాహల చట్టంలోని అంశాలను ఆలయ సిబ్బందికి వివరించారు.

బుక్కరాయసముద్రం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డాక్టర్ తెహరున్నీసా అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌బీ కాలనీలో బాల్య వివాహాల నిర్మూలన, మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య ఎడుకేటర్ పర్వీన్ సీహెచ్ఓ మోహన్‌రావు, రాజేంద్ర ప్రసాద్, రమాదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టండి

పెద్దవడుగూరు: ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలని తాడిపత్రి ఏపీడీ పుల్లారెడ్డి, ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పశువులకు నీటి తొట్టెలు, ఫారంపాండ్స్ నిర్మాణం, పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

యల్లనూరు: మండల కేంద్రంలో కర్నూలు చక్ర ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టరు కొంకిరి కమలమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి , జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి 253 మంది రోగులు హాజరుకాగా 53 మంది కంటికి, 21మంది గుండెకు 4, మోకాలు సర్జరీ ఒకటి జనరల్ సర్జరీ కేసులు నమోదయ్యాయని వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గుత్తి: గుత్తిలోని పలు ప్రాంతాల్లో అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం వాసవీ మిత్ర బృందం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాసవీ మిత్ర బృందం సభ్యులు హరిప్రసాద్, విక్రమ్, మణికంఠ, కృష్ణమూర్తి, అశోక్ రాజు తదితరులతో కలసి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

అండగా ఉంటాం..

గుత్తి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త విజయ్ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న అన్నారు. గుత్తిలోని జంగాల కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అశ్వ చిన్న మారెన్న కుమారుడు విజయ్ ఈ నెల 10న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మతదేహాన్ని బుధవారం పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, జిల్లా నాయకుడు సుభాష్‌రెడ్డి, మాజీ సర్పంచు పీరా, వెంకటేశ్వర రెడ్డి ఆస్పకి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు మంజునాథ్ రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడి లేని 'అక్షయ తృతీయ'

తాడిపత్రిటౌన్: అక్షయ తృతీయ పట్టణంలోని బంగారు వ్యాపారులకు నిరాశపరిచింది. గత ఏడాదితో పోలిస్తే 25 శాతం కూడా కొనుగోలు జరగకపోవడంతో వ్యాపారులు నిరుత్సాహానికి గురయ్యారు. పెరిగిన ధరలతో ప్రజలు బంగారు కొనుగోలుకు వెనుకడుగు వేశారని వ్యాపారులు భావిస్తున్నారు. అక్షయ తృతీయ రోజు బంగారు కొంటే లక్ష్మీకటాక్షం కలుగుతుందని కొందరి నమ్మకం. బంగారు నగల దుకాణ దారుల కూడా అక్షయ తృతీయ డిస్కంట్‌లు పేరుతో ప్రకటన బోర్డులు జోరుగా వెలిశాయి. కొంత మంది అప్పు చేసి మరీ బంగారు కొనుగోలు చేస్తూ అక్షయ తృతీయ సెంట్‌మెంట్‌ను కొనసాగించగా... మరి కొందరు బంగారు కొనుగోలుకు దూరంగా వుండి ఆలయాల్లో పూజలతో సంతృప్తి చెందారు.

అంగన్‌వాడీలకు సామగ్రి పంపిణీ

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 302 అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం సామగ్రిని పంపిణీ చేశామని సీడీపీఓ సాజిదాభేగం తెలిపారు. బిందెలు, పలకలు, చీపుర్లు, ఫినాయిల్, జగ్గులు, చాపలు తదితర సామగ్రిని పంపిణీ చేశామన్నారు. అలాగే కిశోరి వికాసానికి సంబంధించిన పుస్తకాలలు అందజేశామన్నారు.

విద్యార్థులకు ఉచిత కోచింగ్

శింగనమల: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు శింగనమల, తరిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉచిత కోచింగ్ ఇస్తామని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 18వ తేదీ వరకు ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. విద్యార్థులు కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

పొట్టి శ్రీరాములు పార్క్ ప్రారంభం


అతిథులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించిన పొట్టి శ్రీరాములు పార్క్‌ను అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కొత్రికె మధుసూదన్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సిరుగుప్ప వెంకటేష్ దంపతులు, జిల్లా కార్యదర్శి పోతుల మనోజ్ కుమార్, కోశాధికారి సత్య రంగయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు వంకదారి జయలక్ష్మి, కోశాధికారి గీతావాణి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వర ప్రసాద్ దంపతులు, గుత్తి ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు తదితరులు పార్క్‌ను ప్రారంభించి, పార్క్‌లో మొక్కలు నాటారు. గోపూజ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గుంతకల్లు అధ్యక్షుడు గోపా జగదీష్, మాజీ అధ్యక్షుడు కాసుల సుబ్బయ్య శెట్టి, మాజీ సర్పంచు హుస్సేన్ పీరా, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, వెంకట్, కోశాధికారి మహేష్, గుత్తి ఆర్ఎస్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మల్లికార్జున, వాసవీ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రాధాదేవి, కలుగొట్ల కృష్ణవేణి, గీతా వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి


పామిడిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సేవ్ ఆర్డీటీ అంటూ దివ్యాంగుల ధర్నా

తాడిపత్రి/పామిడి: జిల్లా వ్యాప్తంగానే కాకుండానే, అనేక ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ కింద వచ్చే ఫారెన్ నిధులను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని, తాడిపత్రి పట్టణ సీపీఐ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మండిపడ్డారు. ఆర్డీటీ పునరుద్ధరణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వారు వినతి పత్రం అందజేశారు. అలాగే పామిడిలోని ఎద్దులపల్లిరోడ్డు వద్ద ఉనన అంబేడ్కర్ విగ్రహం వద్ద విశాల ఫెర్రర్ వికలాంగ మండల సమాక్య ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులు సేవ్ ఆర్డీటీ అంటూ ధర్నా చేట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేశవాచారి, సెక్రటరీ సర్వేష్, జాయింట్ సెక్రటరీ నాగభూషణం, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: జేసీ

పెద్దవడుగూరు/గార్లదిన్నె/గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్/పుట్లూరు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. బుధవారం పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా దళితులపై దాడులకు పాల్పడితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఏదైనా సమస్య ఉంటే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఎస్ఐ ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పర్యటించిన జేసీ

గార్లదిన్నె మండల కేంద్రంతో పాటు మర్తాడులో బుధవారం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి బాధితులతో మాట్లాడారు. తహసీల్దార్ ఈరమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

గుంతకల్లు మండలంలోని నెలగొండ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవితోపాటు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్ యాదవ్ మాట్లాడారు. అలాగే గుత్తి మండలంలోని అనగానదొడ్డి, పుట్లూరు మండలంలోని కుమ్మనమల, గార్లదిన్నె మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీలార్లు, ఈఓఆర్డీలు, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్టిఫైడ్ విత్తనాలే విక్రయించాలి

గుత్తి: కంపెనీలు సర్టిఫై చేసిన విత్తనాలనే డీలర్లు విక్రయించాలని ఏడీఏ ఆదేశించారు. గుత్తిలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో డివిజన్ స్థాయిలోని డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. హెచ్‌టీ కాటన్ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్పీకే పత్తి, ఇతర విత్తనాలు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో గుత్తి, శింగనమల, యాడికి, పామిడి, పెద్దవడుగూరు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


కిరాణ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రమూర్తి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలపై ఉమ్మడి జిల్లాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రమూర్తి బుధవారం దాడులు చేశారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేని దుకాణాలపై కేసులు నమోదు చేశారు. దుకాణాదారులు తప్పనిసరిగా ఫుడ్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తీసుకోవాలని హెచ్చరించారు. ఫాస్టు ఫుడ్, కాయలను మాగబెట్టే వ్యాపారులు సైతం సరిఫికెట్లు తీసుకోవాలన్నారు. అసోషియేషన్లలో సభ్యత్వం ఉందని, తాము తీసుకోవాల్సిన అవసరం లేదని కొందరు దుకాణాదారులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో వాదించే ప్రయత్నం చేశారు. వారిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇకపై అసోసియేషన్ పేరు చెప్పి ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు తీసుకోవడంలో జాప్యం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు.


ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

గుంతకల్లుటౌన్: పట్టణంలో బుధవారం ఏపీ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్, సర్వేపల్లి రాధాక్రిష్ణ, రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూళ్లతో పాటు ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1195 మంది విద్యార్థులకు గానూ 113 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ వెంకట రమణారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి మస్తాన్‌రావు తెలిపారు. ఎగ్జామినేషన్ అబ్జర్వర్ డాక్టర్ యుగంధర్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా నియమింపబడిన డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంఈఓ మస్తాన్‌రావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కేసు నమోదు

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఇంటిపై నిద్రిస్తుండగా ఈ నెల 21న రాత్రి గాజు సీసాలతో కొంత మంది వ్యక్తులు దాడులకు పాల్పడ్డారని 22న ఓ పత్రికా విలేకరి ఈడిగ రామకృష్ణ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మాస్కులు ధరించి దాడులకు పాల్పడిన ఘటనపై గుర్తుతెలియని నలుగురు వ్యక్తులపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసనట్లు పోలీసులు తెలిపారు.

ఆంజనేయుడు, రాఘవేంద్రుడికి చందన లేపనం



ఆంజనేయస్వామి , రాఘవేంద్రస్వామి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారికి చందన లేపన కార్యక్రమం నిర్వహించారుజరిగింది. అక్షయ తృతీయను పురస్కరించుకొని శ్రీ అంజినేయస్వామి మూల విరాట్‌కు అర్చకులు చందన లేపనం చేశారు. అలాగే పట్టణంలోని వాటర్ వర్క్స్ రోడ్డు వద్ద ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి బృందవనానికి గంధలేపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి విగ్రహాన్ని టేకుతో తయారు చేసిన రథంలో ఉంచి దేవాలయంలో ఊరేగించారు. కార్యక్రమాలకు పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

'కోటంక' స్వామికి బంగారు కంఠాభరణం వితరణ


కంఠాభరణాన్ని అందజేస్తున్న దాతలు

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం బంగారు నెమలి కంఠాభరణాన్ని అనంతపురానికి చెందిన భక్తులు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతల పేరున అర్చకులు విశేష పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రధాన అర్చకుడు రామాచార్యులు మాట్లాడుతూ.. అనంతపురానికి చెందిన చలమారెడ్డి జ్ఞాపకార్థం రూ.4.40 లక్షల విలువైన కంఠాభరణాన్ని ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమారులు చంద్రమోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, కుటుంబసభ్యులు అందజేశారని వివరించారు.

ఘనంగా బసవేశ్వరుడి శోభాయాత్ర


బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


పెద్దవడుగూరులో కలశాలు తీసుకెళ్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: వీరశైవ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం కోదండరామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బసవేశ్వరుడి చిత్రపటంతో పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. వీరభద్ర స్తోత్రాలు, వీర విన్యాసాలు, డోలు వాయిద్యాలు, హరనామస్మరణతో పురవీధులు హోరెత్తాయి. అనంతరం భక్తులకు పీఠాధిపతి చేతుల మీదుగా పంచలోహ శివ లింగాలను అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లికార్జునశాస్త్రి, అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి రవికుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ మఠం మల్లికార్జున, వీరశైవ సంఘం సభ్యులు, భక్తాదులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో బుధవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయుత మహిళలు కలశాలు ఎత్తుకొని కోట చెన్నకేశవ స్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేశారు. బసవేశ్వరస్వామి చిత్ర పటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ.. నందికోలు ఎత్తుకుని నృత్యం చేశారు. కార్యక్రమంలో వీరశైవుల లింగాయతులు , మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పీహెచ్‌సీ తనిఖీ

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా లెప్రసీ , క్షయ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ అనుపమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులతోపాటు ల్యాబ్, ఫార్మసీ, స్టాఫ్ నర్సు గదులను పరిశీలించారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కీర్తన, సీహెచ్ఓ లక్ష్మీనారాయణమ్మ, డీపీఎంఓ సత్యనారాయణ, శ్రావణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్‌బాషా సేవలు ప్రశంసనీయం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ లైటింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ జి.అబ్దుల్‌బాషా (ఎల్ఎస్) సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పదవీ విరమణ సందర్భంగా అబ్దుల్ బాషాను మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

యల్లనూరు: ఉపాధిహామీ పథకంలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన అధికారులకు బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఓ షబ్బీర్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్, శంకర్, అదిల్, శ్రీనివాసులు, కంప్యూటర్ అపరేటర్ సునీతను పూలమాలలు. శాలువాతో సత్కరించారు. ఈఓఆర్డీ మనోహర్‌బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి

పెద్దవడుగూరు: కిశోర బాలికల భవిష్యత్‌పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని తాడిపత్రి ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదా బేగం సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర బాలికల భవిష్యత్ సమ్మర్ క్యాంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో ప్రతి మంగళ, శుక్ర వారం సమ్మర్ క్యాంపు నిర్వహించి, బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మీ, షంషాద్‌బేగం, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం లక్ష్మీ తండా సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి గుంతకల్లు మండలం గుండాల తండా గ్రామానికి చెందిన ప్రవీణ్ నాయక్ అనే యువకుడు గాయపడ్డాడు. అతడిని స్థానికుల గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రవీణ్‌ను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్రవాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో రామ్మోహన్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన ఆయన గుంతకల్లు మండలం అమీన్‌పల్లిలో బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కారు వెనుక నుంచి వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.